

మైల్వార్‌లో మద్యం పట్టివేత
బెల్ట్ షాప్‌లపై పోలీసుల దాడి 6
రూ.16,210 విలువైన మద్యం స్వాధీనం

మరోసారి జెండా వివాదం
ముందస్తుగా ఇరువర్గాల బైండోవర్ 7


వికారాబాద్‌లో శమీ పూజ చేస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్


తాండూరులో పాలపిట్టను వదులుతున్న చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి


పాత తాండూరులోని భవానీమాత ఆలయ ప్రాంగణంలో రావణ దహనం


ఘట్‌కేసర్‌లో రావణ దాహణం

ఘనంగా దసరా

- అంబరాన్నంటిన సంబరాలు
- రావణదహనాలు.. శమీ పూజలు

వికారాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో గురువారం దసరా (విజయదశమి) వేడుకలు ఘనంగా జరిగాయి. జమ్మిచెట్లకు ప్రత్యేక పూజలు చేసి పాలపట్టను చూసి జమ్మి పంచుకొని ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ప్రధానంగా నిర్వహించిన రావణ దహనాలు ఆకట్టుకున్నాయి. అక్కడికి పెద్ద సంఖ్యలో జనాలు చేరుకొని కార్యక్రమాలను తిలకించారు. వికారాబాద్ పట్టణంలోని ఆలంపల్లి శ్రీ అనంతపద్మనాభ స్వామికి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పట్టువస్త్రాలు సమర్పించి శమీ పూజ నిర్వహించారు. అనంతరం బోనమ్మ ఆలయాల వద్ద రావణ దహనం చేశారు. తాండూరులోని భవానీమాత ఆలయం వద్ద చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి పాల పిట్టలను వదిలిపెట్టారు. అనంతరం శమీపెట్టి అలయ్‌బలయ్ చేసుకున్నారు. అలాగే మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్‌లోని గురుకుల్ కళాశాల మైదానంలో, ఘట్‌కేసర్‌లోని గ్రాంథాలయం వద్ద, బొక్కోనిగూడ చౌరస్తా వద్ద నిర్వహించిన రావణ దహనాలు అలరించాయి.

-వికారాబాద్/తాండూరు/ఘట్‌కేసర్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి)

3 రోజులు.. రూ.200కోట్లు

దసరాకు మద్యం కిక్కు

అమ్మకాల్లో ఉమ్మడి రంగారెడ్డిజిల్లాదే అగ్రస్థానం



మేడ్చల్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): దసరా పండుగకు ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో మద్యం ఏరులై పారింది. మద్యం అమ్మకాలకు పండుగ రోజైన అక్టోబర్ 2న సెలవు దినమైనప్పటికీ చివరి రెండు రోజుల్లో ఉమ్మడి జిల్లాలోని ఐదు ఎక్సైజ్ జిల్లా కార్యాలయల పరిధిలో రికార్డుస్థాయిలో మద్యం అమ్మకాలు జరిగాయి. దసరాకు ముందు మూడు రోజులు అంటే అక్టోబర్ 29 నుంచి సెప్టెంబర్ 1వ తేదీ వరకు ఉమ్మడి జిల్లాలో దాదాపు రూ.200 కోట్లకుపైనే మద్యం అమ్మకాలు జరిగాయి. పండుగ రోజైన ఈనెల 2వ తేదీన గాంధీజయంతి కూడా రావడంతో ప్రభుత్వం మద్యం అమ్మకాలపై నిషేధం విధించిన సంగతి తెలిసిందే. అయితే మద్యంప్రియులు ముందుగానే భారీగా మద్యం కొనుగోలు చేసుకున్నారు. ఈ మూడు రోజుల్లో జరిగిన మద్యం విక్రయాలు ఎక్సైజ్ శాఖ అధికారులను

మిగతా 6వ పేజీలో...



సీఎం రేవంత్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు పక్కన ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

దసరా సందర్భంగా గురువారం తన స్వగ్రామం కొండారెడ్డిపల్లికు వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపేందుకు పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. ఉమ్మడి జిల్లాతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా వచ్చిన కార్యకర్తలతో ఆ గ్రామానికి వచ్చే రోడ్లన్నీ కిక్కిరిసాయి. ప్రతీ ఏడాది మాదిరిగానే ముఖ్యమంత్రి స్థానిక నేతలు, కార్యకర్తలను కలిశారు. అంతకు ముందు కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి ఆయనకు ఘన స్వాగతం పలికారు.

-కొడంగల్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి)

వెజిట్రబుల్స్



ఉమ్మడి జిల్లాలో తగ్గిన కూరగాయల సాగు

హైదరాబాద్ నగర శివారుల్లో ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం గణనీయంగా పడిపోతోంది. ముఖ్యంగా మహానగర వాసులకు అవసరమైన కూరగాయాలను అధికంగా సమకూర్చే ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో కూరగాయల సాగు తగ్గిపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఈ ఏడాది భారీ వర్షాల కారణంగా ఉద్యాన పంటల సాగుపై తీవ్ర ప్రభావం పడింది. రియలెస్టేట్, పట్టణీకరణ పుణ్యమా అని ఏటేటా సాగు తగ్గిపోతోంది. అలాగే ఉద్యానపంటల సాగులో ఉన్న కష్టనష్టాలతో రైతులు సైతం ప్రత్యామ్నాయం వైపు మొగ్గు చూపుతున్నారు.



- భారీ వర్షాలతో పంటలపై తీవ్ర ప్రభావం
- నగర అవసరాలకు అందని కాయగూరలు
- పట్టణీకరణతోనూ తగ్గుతున్న ఉద్యాన పంటలు
- ప్రత్యామ్నాయం వైపు మొగ్గుచూపుతున్న రైతులు

వేల ఎకరాల్లో తగ్గుదల

రంగారెడ్డి జిల్లాలో పదేళ్ల క్రితం ఏటా 72వేల ఎకరాల్లో ఉద్యాన పంటల సాగు జరిగేది. కానీ, ఈ ఏడాది వానకాలం సీజన్‌లో 52,844 ఎకరాల్లో పంటలు వేయాలని లక్ష్యం నిర్ణయించగా ఇప్పటివరకు కేవలం 10,675 ఎకరాల్లో మాత్రమే రైతులు పంట వేశారు. వికారాబాద్ జిల్లాలో కూడా 45వేల ఎకరాల నుంచి 23 వేల ఎకరాలకు ఉద్యాన పంటల సాగు పడిపోవడం విస్మయానికి గురి చేస్తోంది.


చేవెళ్ల మండలం ఇబ్రహీంపల్లిలో వర్షాలకు దెబ్బతిన్న టమాట పంట

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి)

హైదరాబాద్ మహానగరానికి ఆనుకొని ఉన్న ఉమ్మడి రంగారెడ్డిజిల్లాలో అన్ని సీజన్లలోనూ కూరగాయలకు మంచి డిమాండ్ ఉంటుంది. ఇక్కడ పండించిన పంటను హైదరాబాద్‌లోని వివిధ మార్కెట్లకు, రైతు బజార్లకు తరలిస్తుంటారు. గడిచిన దశాబ్దంన్నరగా ఈ ప్రాంతాల్లో కూరగాయల సాగు గణనీయంగా తగ్గిపోయింది. పట్టణీకరణతో నగర శివారుల్లో ఉద్యాన పంటలు సాగు చేసే భూములన్నీ రియల్ ఎస్టేట్ వెంచర్లుగా మారిపోతున్నాయి. అనేక ప్రాంతాల్లో పారిశ్రామిక వాడలు వచ్చాయి. అయితే ఈ ఏడాది వానాకాలంలో ఆయా ప్రాంతాల్లో వేసిన కూరగాయ, ఆకుకూరల పంటలు భారీ వర్షాలకు దెబ్బతిన్నాయి. ఉమ్మడి జిల్లా అంతటా ఇదే పరిస్థితి

మిగతా 7వ పేజీలో...

రంగారెడ్డి జిల్లాలో సాగు ఇలా.. (సంవత్సరాల వారీగా ఎకరాల్లో)

2021-22	62,598
2022-23	64,397
2023-24	60,714
2024-25	15,464
2025-26	10,675


గాంధీజీ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న జిల్లా పోలీసులు

అహింస, సత్యాగ్రహం స్ఫూర్తిదాయకం

వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి

వికారాబాద్/ మేడ్చల్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గాంధీజీ అనుసరించిన అహింస, సత్యాగ్రహం ఎంతో స్ఫూర్తిదాయమకని ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. గురువారం ఎస్పీ కార్యాలయంలో జిల్లా పోలీస్ అధికారులతో కలిసి గాంధీజీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే లాల్ బహదూర్ శాస్త్రీ జయంతి సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. శాస్త్రీ దేశానికి ప్రధాని అయిన కూడా సాదాసీదా జీవితాన్ని గడిపారన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రాములు తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్ కలెక్టరేట్‌లో..

అహింసా శాంతిమార్గం ద్వారా దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన మహనీయుడు మహాత్మా గాంధీజీ అని జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ కొనియాడారు. గురువారం మేడ్చల్ కలెక్టరేట్‌లో గురువారం బాపూజీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఆమె పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏవో రామ్మోహన్, పంచాయతీ రాజ్ ఏఈఈ నిషారెడ్డి, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.


మేడ్చల్ కలెక్టరేట్‌లో గాంధీజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు



టెన్షన్.. టెన్షన్!

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల పెంపు జీవోపై రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఏం చెప్పనుందనేది ఉమ్మడి జిల్లా రాజకీయ వర్గాల్లోనూ తీవ్ర ఉత్కంఠగా మారింది. జీవో 9 అమలుకు అనుమతిస్తూ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అనుకూలంగా ప్రకటన చేస్తుందా? లేక నిలిపివేస్తూ ప్రకటన వస్తుందా? అసలు అక్టోబరు 8న ఏం జరగనుంది.. ఏ నలుగురు కలిసినా ఇదే చర్చ కొనసాగుతోంది.

అందరి దృష్టి 8వ తేదీపైనే

- కోర్టు తీర్పుపైనే ఎన్నికల భవితవ్యం
- జీవో9కి అనుకూలమా..వ్యతిరేకమా?
- రిజర్వేషన్లపై రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ
- ఊగిసలాటలో ఆశావహులు, నేతలు
- ఎన్నికల ఏర్పాట్లలో అధికారులు

జిల్లాలో రిజర్వేషన్లు ఇలా

వికారాబాద్ జిల్లా పరిషత్ స్థానం బీసీ జనరల్‌కు రిజర్వు చేశారు. అలాగే జిల్లాలోని 20 జెడ్పీటీసీ స్థానాల్లో ఎస్టీలకు 2, ఎస్సీలకు 4, బీసీలకు 8, జనరల్‌కు 6 స్థానాలు రిజర్వు చేశారు. 20 ఎంపీపీ స్థానాల్లో ఎస్టీలకు 2, ఎస్సీలకు 4, బీసీలకు 8, జనరల్‌కు 6 స్థానాల చొప్పున కేటాయించారు. 227 ఎంపీటీసీ స్థానాల్లో ఎస్టీలకు 26, ఎస్సీలకు 47, బీసీలకు 97, జనరల్‌కు 57 స్థానాలు రిజర్వు చేసిన విషయం తెలిసిందే. జిల్లాలోని 594 పంచాయతీలకు గాను ఎస్టీలకు 119, ఎస్సీలకు 112, బీసీలకు 210, జనరల్‌కు 153 చొప్పున కేటాయించారు.

వికారాబాద్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): బీసీ రిజర్వేషన్లను 42 శాతం పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం జీవో 9ని జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ విషయం ఇప్పుడు హైకోర్టుకు చేరిన విషయం విదితమే. ఒకవేళ ఈ జీవోపై స్టే ఇస్తే ప్రకటించిన ప్రకారం ఎన్నికలు జరుగుతాయా? లేక వాయిదా వేస్తారా? అనేది హాట్ టాపిక్‌గా మారింది. ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచ్ ఎన్నికలు నిర్వహించేందుకు గతనెల 29వ తేదీన రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించిన విషయం తెలిసిందే. స్థానిక సంస్థల ఎన్నికల్లో

మిగతా 6వ పేజీలో...


కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను సన్మానిస్తున్న సుదర్శన్‌రెడ్డి

కేంద్రమంత్రిని కలిసిన సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ జైన్ వ్యాపార సమాజం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొనేందుకు శుక్రవారం నగరానికి వస్తున్న కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి ఎయిర్‌పోర్టులో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దసరా శుభాకాంక్షలు తెలిపి మంత్రిని శాలువాతో సన్మానించారు. ఆయనతో పాటు బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాలు తీసిన సరదా

చెరువులో మునిగి ఇద్దరు బాలికలు మృతి

దుద్యాల, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలకు సెలవులు ఉండటంతో సరదాగా అలుగు పారుతున్న చెరువును చూసేందుకు వెళ్లిన ఇద్దరు బాలికలు ప్రమాదవశాత్తు నీట మునిగి దుర్మరణం చెందారు. ఈ దుర్ఘటన దుద్యాల మండలం అల్లిఖాన్‌పల్లిలో శుక్రవారం జరిగింది. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. అల్లిఖాన్‌పల్లి గ్రామానికి చెందిన 20 మంది బాలికలు శుక్రవారం సైకిళ్లపై గ్రామ శివారులోని చింతల్‌చెరువును చూసేందుకు వెళ్లారు. అలుగు పారుతుడంటంతో అందరూ కలిసి అలుగు నీటిలో సరదాగా ఆడుకున్నారు. తమకు ఈత వస్తుందనే నమ్మకంతో గ్రామానికి చెందిన ఊదరి రాములు, లక్ష్మి దంపతుల కూతురు ప్రణతి(13), కొత్తపల్లి హిందు, అరుణ దంపతుల కూతురు వృక్షిత(12) అలుగు దాటి కొద్ది దూరం వెళ్లి ఈత కొట్టేందుకు ప్రయత్నించారు. ఆ ప్రాంతంలో పెద్ద గుంత ఉందనే విషయం తెలియక ఇద్దరూ నీటిలో మునిగిపోయారు. గమనించిన ప్రణతి అక్క నందిని ఇతర స్నేహితులకు విషయం తెలిపింది. అందరూ గట్టిగా కేకలు వేయడంతో కొద్ది దూరంలో బట్టలు ఉతుకుతున్న స్థానికులు పిల్లల అరుపులు, కేకలు విని వెంటనే అక్కడికి వచ్చారు. అప్పటికే ఇద్దరు బాలికలు నీటిలో మునిగిపోయారు. ఆ సమయంలో అటుగా వెళ్తున్న పలువురు యువకులు నీటిలోకి దిగి ప్రణతి, వృక్షితలను చెరువులో నుంచి బయటకు తీశారు. కాగా, ఇరువురు అప్పటికే ఇద్దరు మృతి చెందారు. ఇద్దరు బాలికలు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. విషయాన్ని తెలుసుకున్న కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆవుటి శేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి మెరుగు వెంకటయ్య, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకారం వేణుగోపాల్, హకీంపేట్ నర్సింహారెడ్డి తదితరులు గ్రామానికి చేరుకొని బాధిత కుటుంబాలను పరామర్శించారు.


ప్రణతి, వృక్షిత(ఫైల్)

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలి

» సీపీఎం జిల్లా కార్యదర్శి యాదయ్య


సమావేశంలో మాట్లాడుతున్న యాదయ్య

ఆదిభట్ల/యాచారం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడుతున్న సీపీఎం అభ్యర్థులను వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిపించాలని పార్టీ జిల్లా కార్యదర్శి పగాడల యాదయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం యాచారం మండల పరిధిలోని మాల్‌లోని ఓ ఫంక్షన్ హాలులో విలేకరులతో మాట్లాడుతూ అధికారంలో ఉన్నా, లేకున్నా ప్రజా సమస్యలపై పోరాడుతున్న సీపీఎం నిరంతరం పేదల సమస్యలపై పోరాడుతుందన్నారు. కులం, మతం, డబ్బులకు కాకుండా ప్రజా సమస్యలపై పోరాడే అభ్యర్థులకు పట్టం కట్టాలన్నారు. ప్రజా సమస్యలపై పోరాడుతున్న నాయకులు ప్రజా ప్రతినిధులుగా ఎన్నికైతే అధికారులను నిలదీసి సమస్యలను పరిష్కరిస్తారన్నారు. ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు అంజయ్య, బ్రహ్మయ్య, జంగయ్య, చందునాయక్, పెద్దయ్య, వెంకటయ్య, తావునాయక్, జగన్ పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌ను కలిసిన ఫరీద్



ఆమనగల్లు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర కార్యదర్శి ఎండీ.ఫరీద్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. దసరా వేడుకల నేపథ్యంలో కొండారెడ్డిపల్లికి వచ్చిన రేవంత్‌రెడ్డిని కలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఎన్ఎస్‌యుఐ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను సీఎంకు వివరించినట్లు ఫరీద్ తెలిపారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన సూచించారని చెప్పారు.

దుర్గామాత ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి

- స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

మోమిన్‌పేట్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): దుర్గామాత ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని టేకులపల్లిలో దుర్గామాత శోభాయాత్రను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్పీకర్ ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ మోమిన్‌పేట్ మండల ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మన్నె శంకర్ యాదవ్, నాయకులు నరోత్తంరెడ్డి, సుభాష్‌గౌడ్, సురేందర్, మల్లేశం, ఏరాజ్‌పాష తదితరులు పాల్గొన్నారు.


స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌తో మోమిన్‌పేట్ మండల కాంగ్రెస్ నాయకులు

టెన్షన్.. టెన్షన్!

(ఐదో పేజీ తరువాయి)

2011 జనాభా ప్రకారం ఎస్సీ, ఎస్టీలకు ప్రాదేశిక స్థానాలు, పంచాయతీలను కేటాయించగా, జీవో 9 ప్రకారం బీసీలకు 42 శాతం మేర పంచాయతీలు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలను రిజర్వు చేశారు. జనరల్ స్థానాలతో పాటు మహిళలకు రిజర్వు చేసిన స్థానాలనూ ప్రకటిస్తూ గెజిట్ విడుదల చేశారు.

తర్వాత చూద్దామన్నా.. తప్పని ఖర్చు

రిజర్వేషన్లు తమకు అనుకూలంగా వచ్చిన ప్రాంతాల్లో ఆశావహులు కొందరు ఎన్నికల బరిలో నిలిచేందుకు సన్నాహాలు పారంభించగా, మరికొందరు వేచి చూసే ధోరణితో ఉన్నారు. జీవోకు వ్యతిరేకంగా కోర్టు తీర్పు వస్తే రిజర్వేషన్లు మారే అవకాశం ఉన్నదని, ఈనెల 8న హైకోర్టు తీర్పు వచ్చిన తర్వాతనే ముందుకు సాగే విషయం తేల్చుకుందామని పలువురు భావిస్తున్నారు. రిజర్వేషన్లు కలిసి వచ్చిన ఆశావహుల్లో కొందరు దసరా వేడుకలకు, మందు, విందు కోసం బాగానే ఖర్చు చేసినట్లు తెలుస్తోంది. ఆచితూచి వ్యవహరిస్తున్న వారు కూడా ఎంతో కొంత ఖర్చు చేయాల్సిన పరిస్థితులను దసరా పండగ కల్పించింది. అక్టోబరు 8వ తేదీ తర్వాత చూసుకుందామంటూ ఖర్చు నుంచి తప్పించుకునే ప్రయత్నం చేసినా ఆశావహులు ఖర్చు బారిన పడక తప్పని పరిస్థితులు ఎదురయ్యాయి.




నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు

మహాత్ముల అడుగు జాడల్లో నడుద్దాం

షాద్‌నగర్ అర్బన్, అక్టోబరు3(ఆంధ్రజ్యోతి): దేశ కోసం జీవితాలను అంకితం చేసిన జాతిపిత మహాత్మాగాంధీ, మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రిల అడుగు జాడల్లో ప్రతీ ఒక్కరు నడిచి, దేశాభివృద్ధికి పాటుపడాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్‌కుమార్‌రెడ్డిలు పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే శంకర్, కాంగ్రెస్ నాయకులు ఫరూఖ్‌నగర్‌లోని మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, మున్సిపల్ మాజీచైర్మన్ నరేందర్‌లు షాద్‌నగర్‌లో గాంధీ, లాల్‌బహదూర్‌శాస్త్రిల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి సేవలను గుర్తుచేశారు.


ఎమ్మెల్యేను శాలువాతో సత్కరిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు

ఎమ్మెల్యే మల్లారెడ్డిని కలిసిన బీఆర్ఎస్ నాయకులు

ఘట్‌కేసర్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): దసరా పండుగ సందర్భంగా శుక్రవారం ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీలకు చెందిన బీఆర్ఎస్ శ్రేణులు మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డిని కలిసి శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. నగరంలోని బోయిన్‌పల్లిలో గల ఎమ్మెల్యే ఇంటికి చేరుకొని దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీల బీఆర్ఎస్ నాయకులు బద్దం జగన్‌మోహన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, శేఖర్, రెడ్డియా నాయక్, అక్రం అలీ, రాజశేఖర్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.


సీఎం రేవంత్‌రెడ్డితో మహిపాల్‌రెడ్డి

రోడ్ల మరమ్మతులు వెంటనే చేపట్టాలి

» సీఎం రేవంత్‌రెడ్డికి మహిపాల్‌రెడ్డి విజ్ఞప్తి

వికారాబాద్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలకు గుంతలమయంగా మారిన రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని, అలాగే అవసరమైన చోట కొత్త రోడ్లు మంజూరు చేయాలని ఉమ్మడి జిల్లా జెడ్పీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు పీలారం మహిపాల్ రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం కొడంగల్‌లో నిర్వహించిన దసరా గ్రీటింగ్స్ కార్యక్రమానికి ఆయన తన సోదరుడు హన్మంత్‌రెడ్డితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన గత మూడు నెలలుగా కురుస్తున్న వర్షాలకు జిల్లాలో రోడ్ల గుంతలమయంగా మారి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్న విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా కొత్తగడితో పాటు పలుచోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాలకు గుంతలమయంగా మారిన రోడ్లే కారణమనే విషయాన్ని వివరించారు. రాత్రి వేళలో ఎక్కడ గుంతలు ఉన్నాయో తెలియక వాహనదారులు ప్రమాదాల బారిన పడి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని సీఎం రేవంత్ రెడ్డికి వివరించారు. అలాగే జిల్లాలో రోడ్లకు అవసరమైన మరమ్మతులు చేపట్టడంతో పాటు కొత్త రోడ్లు మంజూరు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

3 రోజులు.. రూ.200కోట్లు

(ఐదో పేజీ తరువాయి)

కొంత ఆశ్చర్యానికి గురిచేశాయి.

మూడింతలపైనే అమ్మకాలు..

గతేడాదితో పోలిస్తే మద్యం అమ్మకాలు పెరిగాయి. స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ వెలువడటంతో శివార్లలో పెద్దఎత్తున మద్యం కొనుగోళ్లు జరిగాయి. పండుగ పేరుతో రాజకీయ నేతలు విందులు ఏర్పాటు చేశారు. పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మద్యం అమ్మకాల్లో ఉమ్మడి రంగారెడ్డిజిల్లా ముందుంది. తరువాత ఉమ్మడి కరీంనగర్, ఉమ్మడి నల్గొండ, ఉమ్మడి వరంగల్ జిల్లాలు వరుసగా తర్వాత స్థానాల్లో నిలిచాయి. మద్యం అమ్మకాల్లో ఇండియన్ మేడ్ ఫారిన్ లిక్కర్ (ఐఎంఎల్) విక్రయాలు భారీగా పెరగగా బీర్ల అమ్మకాలు సాధారణంగానే ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో శంషాబాద్, సరూర్‌నగర్, మల్కాజిగిరి ఎక్సైజ్ పరిధిలో మద్యం అమ్మకాలు అధికంగా ఉన్నాయి. ఒక్కోచోట మూడు రోజుల్లో సగటు రూ.45 కోట్ల నుంచి రూ.50 కోట్లకుపైగా అమ్మకాలు జరిగాయి. మేడ్చల్ పరిధిలో రూ.40 కోట్ల వరకు అమ్మకాలు జరిగినట్లు అధికారులు తెలిపారు. సాధారణంగా ప్రతి రోజూ ఇక్కడ రూ.8 కోట్ల నుంచి రూ.9 కోట్ల వరకు అమ్మకాలు జరుగుతుండగా పండుగ మూడు రోజుల్లో మూడింతలు పెరిగినట్లు అధికారులు చెప్పారు.

మైల్వార్‌లో మద్యం పట్టివేత

బషీరాబాద్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మైల్వార్‌లో బుధవారం రాత్రి ఓ బెల్టు షాపుపై బషీరాబాద్ పోలీసులు దాడిచేశారు. ఎస్ఐ నుమాన్‌అలీ ఆధ్వర్యంలో పోలీసులు గ్రామంలోని మోహన్‌గౌడ్ ఇంట్లోని దుకాణంలో మద్యం ఉందనే సమాచారంతో తనిఖీ చేసి మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. సుమారు రూ.16,210 విలువైన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు బెల్టుషాపు నిర్వాహకులు వాపోతున్నారు. ఆ సమయంలో ఇంట్లో మహిళ ఉండటంతో పోలీసులు మహిళా కానిస్టేబుల్ లేకుండా రాత్రి వేళలో ఇంట్లోకి చొరబడిన పోలీసులు హంగామా చేసి మద్యం పట్టుకెళ్లినట్లు కుటుంబీకులు ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామంలో ఐదారు బెల్టు షాపులు కొనసాగుతున్నా తమ ఇంట్లో మాత్రమే దాడి జరిపి మద్యం తీసుకెళ్లారని వారు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై బషీరాబాద్ ఎస్ఐని వివరణ కోరగా ఎన్నికల కోడ్ నేపథ్యంలో దాడి జరిపి మద్యం సీజ్ చేసినట్లు చెప్పుకొచ్చారు. ఎంత మద్యం స్వాధీనం చేసుకున్నారనే దానిపై అడుగగా రేపు చెబుతామని సమాధానం దాటవేశారు. ఇదిలాఉండగా ఒకటే బెల్టు షాపుపై దాడి జరిపి మద్యం పట్టుకోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

వైభవంగా పారువేట ఉత్సవం

కొడంగల్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): విజయదశమిని పురస్కరించుకొని పేదల తిరుపతిగా పేరొందిన కొడంగల్ శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో పారువేట ఉత్సవాన్ని గురువారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయం నుంచి మంగళ వాయిద్యాలతో స్వామివారు అశ్వవాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం పారువేట మండపం వద్ద వేద పండితులు, ఆలయ ధర్మకర్తలు నందారం కుటుంబసభ్యులు షమీ పూజలు చేశారు.


అశ్వ వాహనంపై వేంకటేశ్వర స్వామి

సంగెంకలాన్‌లో ఇరువర్గాల ఘర్షణ

- పలువురికి తీవ్ర గాయాలు

తాండూరు రూరల్, అక్టోబరు3 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు యువకుల మధ్య గొడవ ఇరువర్గాలు దాడులు చేసుకునే స్థాయికి చేరింది. పోలీసులు రంగప్రవేశం చేసి చెదరగొట్టారు. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని సంగెంకలాన్ గ్రామానికి చెందిన సంతోష్, బీజేపీ నాయకుడు కాళ్ల సంజీవరెడ్డి సోదరుడు కాళ్ల సాయిరెడ్డిలు శుక్రవారం రాత్రి గ్రామంలోని ఓ దుకాణం వద్ద మాటల యుద్ధానికి దిగారు. ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి పెద్ద గొడవకు దారితీసింది. ఇరు వర్గాల యువకులు అక్కడికి చేరుకుని పరస్పరం దాడులు చేసుకున్నారు. ఈ దాడిలో నలుగురికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న తాండూరు రూరల్ సీఐ నగేష్, కరన్‌కోట్ ఎస్ఐ రాథోడ్ వినోద్, పట్టణ పోలీసులు హుటాహుటిన గ్రామానికి చేరుకున్నారు. ఇరువర్గాల చెదరగొట్టి పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేశారు. గాయపడిన వారిని తాండూరులోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. ఘర్షణ విషయమై ఇరువర్గాలకు పోలీసు స్టేషన్‌కు తరలించామని ఎస్ఐ రాథోడ్ వినోద్ తెలిపారు. గొడవకు గల కారణాలను సేకరిస్తున్నామని, ఇరువర్గాలపై కేసు నమోదు చేయనున్నట్లు ఎస్ఐ తెలిపారు. గ్రామంలో ఎలాంటి అల్లర్లు, గొడవలు జరుగకుండా ముందస్తుగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

కాంగ్రెస్ సీనియర్ నేత మృతి

ఆమనగల్లు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకుడు, ఆమనగల్లు మండల మాజీ అధ్యక్షుడు, మాజీ ఉప సర్పంచ్ వర్కాల లక్ష్మయ్య(80) మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో చికిత్స పొందుతూ లక్ష్మయ్య శుక్రవారం తదిశ్వాస విడిచాడు. కాంగ్రెస్ పార్టీకి, ఆమనగల్లు పట్టణ అభివృద్ధికి లక్ష్మయ్య పాటుపడ్డారు. ఆయన మృతి పట్ల పలువురు ప్రజాప్రతినిధులు, పద్మశాలి సంఘం నాయకులు లక్ష్మయ్య భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. సంతాపం తెలిపిన వారిలో ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, తల్లోజు ఆచారి, వ కరుణశ్రీకేశవులు, కోట కృష్ణయ్య ఉన్నారు.



సీఎంని కలిసిన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, తాండూరు మహిళా కాంగ్రెస్ నేతలు

సీఎంకు దసరా శుభాకాంక్షలు తెలిపిన తాండూరు నేతలు

తాండూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి నాయకత్వంలో తాండూరుకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు శుక్రవారం కొడంగల్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. సీఎంను కలిసినవారిలో ఆర్‌బీఎల్ సీఈవో శ్రీనివాస్‌రెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ మురళిగౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు డాక్టర్ సంపత్, ప్రభాకర్‌గౌడ్, బంటు వేణు, జిలాని, మహిళా కాంగ్రెస్ నేతలు శోభారాణి, గాజుల మాధవి, మధులత, సుమిత్రి, శాంతాబాయి, తదితరులు ఉన్నారు.



కార్మికులకు దుస్తులు అందజేస్తున్న మల్లేష్‌యాదవ్, నవీన్‌కుమార్

పారిశుధ్య కార్మికులకు దుస్తుల అందజేత

కేశంపేట, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): కొత్తపేట పంచాయతీ కార్మికులకు శుక్రవారం మాజీ ఎంపీటీసీ మల్లేష్‌యాదవ్, మాజీ సర్పంచ్ నవీన్ కుమార్ దుస్తులు అందజేశారు. గత 8 సంవత్సరాలుగా యేటా వస్త్రాలను ఇస్తున్నట్లు వారు తెలిపారు. అలాగే బీజేపీ జిల్లా ఓబీసీ ఉపాధ్యాక్షుడు పసుల నరసింహయాదవ్ కార్మికులకు నూతన వస్త్రాలు అందజేశారు.

జెడ్పీటీసీగా అవకాశం కల్పించండి



మహేశ్‌కుమార్‌గౌడ్‌ను సన్మానిస్తున్న రమేశ్‌గౌడ్

ఆమనగల్లు, అక్టోబరు 3(ఆంధ్ర జ్యోతి): మాడ్గుల జెడ్పీటీసీ పదవికి పోటీచేసేందుకు తనకు అవకాశం ఇవ్వాలని కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకుడు జెల్ల రమేశ్‌గౌడ్ పీసీసీ చీఫ్‌ను కోరారు. ఈ మేరకు శుక్రవారం పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిలను అభ్యర్థించారు. యువజన కాంగ్రెస్ నాయకుడిగా పార్టీ బలోపేతానికి కృషిచేశానని, తన తల్లి నర్సమ్మ ఎంపీటీసీ పనిచేశారని రమేశ్‌గౌడ్ తెలిపారు. పార్టీ ఆదేశిస్తే బీసీ జనరల్ స్థానంలో నిలబడతానని తెలిపారు. అభ్యర్థి ఎవరైనా స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం పార్టీ శ్రేణులంతా పనిచేయాలని కోరారు.

స్నేహితులకు పూర్వవిద్యార్థుల చేయూత



స్నేహితుల కుటుంబాలకు సాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

మంచాల, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మండల పరిధి ఆరుట్లలో కుటుంబ పోషకులను కోల్పోయి ఆదపలో ఉన్న స్నేహితుల కుటుంబాలను ఆదుకునేందుకు పూర్వవిద్యార్థులు ముందుకొచ్చారు. ఆరుట్ల ఉన్నత పాఠశాల 2007 టెన్త్ బ్యాచ్‌కు చెందిన బూర నిర్మల, నూకం కవితల భర్తలు అనారోగ్యంతో ఇటీవల మృతిచెందారు. వారి పదో తరగతి స్నేహితులు రూ.64వేలు జమచేసి శుక్రవారం అందజేశారు. భవిష్యత్తులోనూ వారి కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

అధికారులకు సన్మానం



సీఐ జానకిరామ్‌రెడ్డిని సన్మానిస్తున్న గుర్రం కేశవులు

ఆమనగల్లు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు సీఐ జానకిరామ్ రెడ్డి, పోలీసు అధికారులు, సిబ్బందిని స్థానిక నాయకులు సన్మానించారు. దసరా ఉత్సవాలకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసి శాంతియుతంగా నిర్వహణకు చర్యలు తీసుకున్న సీఐ జానకిరామ్‌రెడ్డి, ఎస్సై వెంకటేశ్‌లను మార్కెట్ కమిటీ మాజీ వైస్‌చైర్మన్ గుర్రం కేశవులు ఆధ్వర్యంలో శుక్రవారం సన్మానించారు. పోలీసుల సేవలను కొనియాడారు. శాంతి సామరస్యం ఉన్నప్పుడే ప్రగతి సాధ్యం అన్నారు. కార్యక్రమంలో కండె హరిప్రసాద్, దుర్గయ్య, నరసింహ, రాములు, అప్పం శ్రీను, కాలె మల్లయ్య, శ్రీకాంత్‌సింగ్, మానయ్య, పసుపుల సాయలు, గిరి తదితరులు పాల్గొన్నారు.

చింతకుంటపల్లిలో కబడ్డీ పోటీలు



విజేత టీంతో మల్లేష్‌యాదవ్, శ్రీధర్‌రెడ్డి, కృష్ణాయాదవ్

కేశంపేట, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): చింతకుంటపల్లిలో శుక్రవారం కబడ్డీ పోటీలు నిర్వహించారు. 10జట్లు పాల్గొనగా సాయి కృష్ణ జట్టు విజేతగా నిలిచింది. టీమ్‌కు కాంగ్రెస్ నాయకుడు మల్లేష్ యాదవ్ రూ.8వేల నగదు అందించారు. ప్రవీణ్‌కుమార్ జట్టు రన్నర్‌గా నిలిచింది. ఈ టీమ్‌కు అల్లు శ్రీధర్‌రెడ్డి రూ.5వేలు, కన్సోలేషన్ బహుమతిని అనెమోని కృష్ణయాదవ్ రూ.3వేలు అందించారు.

ఘనంగా ఎమ్మెల్యే మల్‌రెడ్డి జన్మదిన వేడుకలు



అభిమానుల మధ్య కేక్ కట్‌చేస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి జన్మదిన వేడుకలను గురువారం తొర్రూరులోని క్యాంప్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ కార్యకర్తలు, అధికారులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు తరలొచ్చి రంగారెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అభిమానులు, కుటుంబ సభ్యుల సమక్షంలో ఆయన కేక్ కట్‌చేశారు. ప్రత్యేకంగా రూపొందించిన రథంపై ఆయనను ఊరేగించారు. కళాకారుడు ఏపూరి సోమన్న బృందం నిర్వహించిన ధూం ధాం కార్యక్రమం అలరించింది.

పూడూరులో మరోసారి దసరా జెండా వివాదం

ముందు జాగ్రత్తగా ఇరువర్గాల బైండోవర్



గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ సత్యనారాయణ

మేడ్చల్ టౌన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) దసరా పండుగ వేడుకల్లో భాగంగా జెండా ఎగురవేసే విషయంలో ఇరువర్గాల మధ్య వివాదం తలెత్తింది. నాలుగు రోజుల పాటు కొనసాగినా చర్చలు ఫలించకపోవటంతో చివరికి పోలీసులు రంగప్రవేశం చేసి ఇరువర్గాలకు చెందిన వారిని బైండోవర్ చేశారు. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని పూడూరులో జెండా ఎగురవేసి దసరా వేడుకలు ప్రారంభించటం ఆనవాయితీగా వస్తోంది. కాగా ఈజెండా ఎగరవేసే కార్యాన్ని పూర్వం నుంచి ఓవర్గానికి చెందినవారు చేపడుతూ వస్తున్నారు. కాగా ఈ వ్యవస్థను మార్చాలని గ్రామంలోని కొన్ని వర్గాల వారు పట్టుబట్టి కూర్చున్నాయి. పటేల్, పట్వారి వ్యవస్థ రద్దైనా జెండా ఎగురవేసే వ్యవస్థ మారడం లేదన్న ఉద్దేశంతో కొన్ని ఇతర వర్గాలకు చెందిన వారు వ్యతిరేకిస్తూ గ్రామప్రజలతో ఎన్నుకోబడిన సర్పంచ్ పండుగ జెండా ఎగురవేసి వేడుకలు ప్రారంభించాలని కొత్త వివాదానికి తెరలేపారు. దీంతో ఇరు వర్గాల మధ్య 2019 నుంచి దసరా పడుగ నాడు గొడవ కొనసాగటం శరమామూలుగా మారింది. దసరా పండుగ వేళ ఈ వివాదం మరోసారి తెరపైకి వచ్చింది. సర్పంచ్‌ల పదవీకాలం ముగియటంతో ప్రస్తుతం పూడూరులో అధికారుల పాలన కొనసాగుతున్నది. ఈ నేపథ్యంలో జెండాను తిరిగి తామే ఎగురవేసి దసరా పండుగ వేడుకలు ప్రారంభిస్తామని ఒక వర్గానికి చెందిన వారు ప్రచారం చేపట్టారు. విషయం తెలుసుకున్న మరో వర్గం వారు మండిపడుతూ గ్రామపెద్దలతో చర్చలు జరిపారు. సామరస్యంగా ఇరువర్గాలు వ్యవహరించాలని మున్సిపల్ అధికారులు, పోలీసులు సముదాయించినప్పటికీ వారు వినిపించుకోలేదు. దీంతో గురువారం ఉదయం పోలీసులు ఇరువర్గాలకు చెందిన కొంతమందిని బైండోవర్ చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రామంలో పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేశారు. ఇరువర్గాలకు చెందిన వారు ఎవరికి వారు పూజలు నిర్వహించి రావణ దహనం చేసి సంబరాలు జరుపుకున్నారు. కాగా పటేల్, పట్వారీ వ్యవస్థ రద్దు చేసినప్పటికీ ఆగ్రవర్గానికి చెందిన కొందరు ఆ వ్యవస్థను కొనసాగించే ప్రయత్నం చేయటం పట్ల గ్రామ మాజీ సర్పంచ్ బాబు యాదవ్ మండిపడ్డారు.

వెజిట్రబుల్స్

(ఐదో పేజీ తరువాయి)

కనిపిస్తోంది. దీంతో భవిష్యత్తులో కూరగాయల కొరత ఏర్పడే అవకాశాలు కనిపిస్తున్నాయి.



భారీ వర్షాలతో చేవెళ్లలో టమాట చేనులో నిలిచిన వర్షం నీరు(ఫైల్)

ప్రభుత్వ ప్రోత్సాహకం కరువు

రాజధానికి వెజిటబుల్ హబ్‌గా ఉన్న ఈ ప్రాంతంలో కూరగాయలు పండించే రైతులకు ప్రభుత్వం నుంచి సరైన ప్రోత్సాహకం లభించడం లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యాన పంటలకు ప్రోత్సాహకాలు ఇస్తున్నట్లు చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో ఇందుకు విరుద్ధమైన పరిస్థితులు కన్పిస్తున్నాయి. ఉద్యాన ప్రణాళికలు రూపొందించినా కాగితాలకే పరిమితమవుతున్నాయి. శివార్లలోని కొన్ని గ్రామాల్లో ప్రయోగాత్మకంగా ఎంపిక చేసిన రైతులతో కూరగాయ పంటలు సాగుచేయించే ప్రయత్నాలు చేసినా అవి విజయవంతం కాలేదు. పాలీహౌజ్, నెట్ హౌజ్‌లకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు గతంలో వలే అందడం లేదు. దరఖాస్తు చేసుకొని ఏళ్లతరబడి వీటి కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. కూరగాయలు పండించే రైతులకు బ్యాంకుల నుంచి రుణాలు కూడా అంతంతమాత్రంగానే అందుతున్నాయి. వివిధ పంటల సాగుకోసం బ్యాంకుల ద్వారా ఇచ్చే రుణపరిమితి (స్కేల్ ఆఫ్ ఫైనాన్స్) కూడా పెంచడం లేదు.

సాగులో ఒడిదొడుకులు

హైదరాబాద్‌కు ఆనుకొని ఉన్న ఉమ్మడి జిల్లాలో అన్ని సీజన్లలోనూ కూరగాయలకు మంచి డిమాండ్ ఉండడంతో గతంలో ఎక్కువ మంది రైతులు ఈ పంటల వైపే మొగ్గు చూపారు. శివార్లలోని ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం, కందుకూరు, మహేశ్వరం, కడ్తాల్, శంషాబాద్, షాద్‌నగర్, కొత్తూరు, నందిగామ, మొయినాబాద్, చేవెళ్ల, మర్పల్లి, పరిగి, శంకరపల్లి, మేడ్చల్, శామీర్‌పేట, కీసర తదితర ప్రాంతాల రైతులు ఎక్కువగా కూరగాయ పంటలు సాగు చేస్తున్నారు. గతంలో బస్సు సౌకర్యం కూడా ఎక్కువగా ఉండడంతో రైతులకు మార్కెటింగ్‌కు ఇబ్బందులు ఉండేది కాదు. నేరుగా హైదరాబాద్‌లోని రైతు బజార్లకు వచ్చి అమ్ముకునే వారు. ఇప్పుడు కొన్ని ప్రాంతాలకు బస్సు సౌకర్యం నిలిచిపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మరో వైపు అతివృష్టి, అనావృష్టితోపాటు పెట్టుబడులు పెరగడం, కూలీల కొరత కారణంగా రైతులు ఉద్యాన పంటలపై ఆసక్తి చూపడం లేదు. దీంతో రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లుతున్నారు. ఈ కారణంగా కూరగాయల సాగు క్రమేపీ తగ్గిపోతోంది. ఫలితంగా ఇతర ప్రాంతాల నుంచి నగరానికి కూరగాయలు సరఫరా చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ప్రజలకు అంతా మంచే జరగాలి



ఎమ్మెల్యేను కలిసిన ఎంపీటీల ఫోరం మాజీ అధ్యక్షుడు ఎస్.రాజశేఖర్‌రెడ్డి



ఎమ్మెల్యే సబితారెడ్డిని కలిసిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కాకి దశరథ్

కందుకూరు, అక్టోబరు3(ఆంధ్రజ్యోతి): విజయదశమి పండుగను పురస్కరించుకొని రంగారెడ్డి జిల్లా, మహేశ్వరం నియోజకవర్గ ప్రజలకు అన్ని రకాల మేలు కలగాలని, అన్ని రంగాల్లో రాణించి ఆర్థిక వృద్ధి సాధించాలని ఎమ్మెల్యే పి.సబితారెడ్డి ఆకాంక్షించారు. శుక్రవారం మీర్‌పేటలోని క్యాంప్ కార్యాలయానికి బీఆర్ఎస్ నాయకులు, ప్రజలు వచ్చి ఎమ్మెల్యేకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేయాలి గానీ.. నేడు రెండు ప్రభుత్వాలు ప్రజలను పట్టించుకోవడంలేదని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బొక్క దీక్షిత్‌రెడ్డి, టి.కార్తీక్, రవీందర్, అఖిల్‌కుమార్, డిల్లీ జంగయ్య, ఎడ్ల కృష్ణ, జి.మహేందర్, పి.మహేందర్, గణేష్‌కుమార్, అంబయ్యాయాదవ్, కె.చంద్రయ్య, డి.వెంకటేశ్వర్‌రెడ్డి, సుధీర్‌గౌడ్, నవీన్, ఆనందం, బాలయ్య, కె.ప్రభాకర్, ఆదిల్ తదితరులు పాల్గొన్నారు.



ఆమనగల్లులో దసరా వేడుకల్లో జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి



కడ్తాల్: మైసిగండిలో అమ్మవారి పూజల్లో సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి

ఆమనగల్లులో ఘనంగా దసరా వేడుకలు

● వేలాదిగా పాల్గొన్న ప్రజలు

ఆమనగల్లు/కడ్తాల్/తలకొండపల్లి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): విజయదశమి పర్వదినాన్ని గురువారం ఆమనగల్లు పట్టణం, మండల పరిధి గ్రామాల్లో ఘనంగా జరుపుకున్నారు. సాయంత్రం జమ్మిచెట్టుకు పూజలు నిర్వహించి ప్రజలు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పాలపిట్ట దర్శనం చేసుకున్నారు. తొమ్మిది రోజులు పూజలందుకున్న దుర్గామాత విగ్రహాలను చెరువుకుంటల్లో నిమజ్జనం చేశారు. రావణ దహనం కార్యక్రమానికి ఎన్సీబీసీ మాజీ సభ్యుడు ఆచారి హాజరయ్యారు. గాంధీచౌక్ వద్ద షమీ పూజ నిర్వహించారు. రావణ దహనం నేపథ్యంలో సీఐ జానకిరెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ వెంకటేశ్ బందోబస్తు ఏర్పాటు చేశారు. కోనాపూర్‌లో జరిగిన వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, టాస్క్ సీవోవో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి, ఆమనగల్లు కోర్టు బార్ అసోసియేషన్ చైర్మన్ యాదిలాల్ పూజలు నిర్వహించారు. కడ్తాలలో స్వామి, అమ్మవార్ల ఊరేగింపు, పల్లకీ సేవ చేపట్టారు. వేడుకల్లో డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్ వేణుగోపాల్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు జంగారెడ్డి, రామకృష్ణ, రాఘవేందర్, పాలాది ఆంజనేయులు, గూడూరు భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు. మైసిగండి మైసమ్మ ఆలయంలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, ఏఎంసీ చైర్‌పర్సన్ యాట గీతనర్సింహ, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, బిచ్యా, జగన్, కృష్ణనాయక్, అజీమ్ పూజలు నిర్వహించారు. తలకొండపల్లి, గ్రామాల్లో దసరా వేడుకల్లో బీఆర్ఎస్ జిల్లా సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్‌యాదవ్, మార్కెట్ మాజీ చైర్మన్ నాలాపురం శ్రీనివాస్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు డోకూరు ప్రభాకర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్, మాజీ ఎంపీపీ నిర్మలశ్రీశైలంగౌడ్, నాయకులు లలితజ్యోతయ్య, కాసు శ్రీనివాస్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ కేశవరెడ్డి పాల్గొన్నారు.

దివ్యశ్రీకి ఎంబీబీఎస్ సీటు



కొడంగల్ రూరల్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెద్దనందిగామ గ్రామానికి చెందిన రంగి దివ్యశ్రీ ఎంబీబీఎస్ సీటు సాధించింది. దివ్యశ్రీకి నీట్‌లో 8,265 ర్యాంకు రాగా ఆమె మహవీర్ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు వచ్చిటన్లు తండ్రి రంగి బసంత్ శుక్రవారం తెలిపారు. తమ గ్రామానికి చెందిన అమ్మాయికి మెడిసిన్‌లో సీటు రావడంతో అమ్మాయిని స్నేహితులు, కుటుంబసభ్యులు, గ్రామస్థులు అభినందించారు.

ఎన్నికల కోడ్ అతిక్రమిస్తే చర్యలు

చౌడాపూర్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్‌ను అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ రమేశ్‌కుమార్ అన్నారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో ఎవరైనా కులం, మతంపై దుష్ప్రచారం చేయడం, సోషల్ మీడియాలో అవమానకర పోస్టులు పెడితే చర్యలు తీసుకుంటామన్నారు. నిబంధన మేరకు ప్రయాణికులు రూ.50వేల కంటే ఎక్కువ తీసుకెళ్తూ పట్టుబడితే సీజ్ చేస్తామన్నారు.

రాజరాజేశ్వరీదేవిగా అమ్మవారి దర్శనం



మహేశ్వరం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మహేశ్వరంలోని రాజరాజేశ్వరాలయంలో దసరా శరన్నవరాత్రోత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని శివగంగ ఆలయంలో రాజరాజేశ్వరిదేవి రూపంలో అమ్మవారికి సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, హోమాలు నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాద వితరణ జరిగాయి. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అల్లె కుమార్, రాఖేశ్, నరేష్, తిరుపతయ్య, సాయిలు, శ్రీశైలం, సువర్ణ ఈవో మురళీకృష్ణ, పూజారులు వీరేషం, రాజు పాల్గొన్నారు.

మైసిగండిలో ముగిసిన శరన్నవరాత్రోత్సవాలు



మైసిగండి పూజల్లో పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, భక్తులు

కడ్తాల్, అక్టోబరు3(ఆంధ్రజ్యోతి):ప్రఖ్యాత పుణ్యక్షేత్రం మైసిగండి శివరామాలయంలో దసరా ఉత్సవాలు శుక్రవారం వైభవంగా ముగిశాయి. ఉత్సవాల ముగింపులో భాగంగా అమ్మవారు రాజరాజేశ్వరీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ఫౌండర్‌ట్రస్టీ రమావత్ సిరోలీపంతూ ఆధ్వర్యంలో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వేదపండితుడు మురళీధర్ శర్మ ఆధ్వర్యంలో చండీహోమం, పూర్ణాహుతి, అభిషేక పూజల్లో తహసీల్దార్ ఆర్.పి.జ్యోతి-అరుణ్ దంపతులు పాల్గొన్నారు. సిరోలీపంతూ, ఈవో స్నేహలత ఆధ్వర్యంలో ఉత్సవాలను ముగించారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, మాజీ సర్పంచ్‌లు తులసీరామ్‌నాయక్, శేఖర్‌గౌడ్, నిర్వాహకుడు భాస్కర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయంలో పూజలు



ఆంజనేయస్వామి ఆలయ పూజలో ఈశ్వర్‌కాలనీవాసులు

షాద్‌నగర్ అర్బన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్‌లోని ఈశ్వర్‌కాలనీలో గల ఈశ్వర అభయాంజనేయ ఆలయ తొమ్మిదో వార్షికోత్సవాన్ని గురువారం జరుపుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ మెడిగ పెంటయ్య ఆధ్వర్యంలో పూజలు చేశారు. అలాగే శివాలయంలోని శివలింగానికి అభిషేకం చేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ చలివేంద్రం రాజేశ్వర్, కాలనీ పెద్దలు పడకంటి శ్రీశైలం, ఎల్.మోహన్‌రెడ్డి, గోర మల్లేశ్‌గౌడ్, ఆవుల శ్రీశైలం, దర్శన్, శేఖర్‌గౌడ్, మణికంఠ పాల్గొన్నారు.

ఆశీర్వదించండి.. అభివృద్ధి చేస్తా



దుర్గామాత ఉత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్ అర్బన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీని ఆదరిస్తే ప్రభుత్వ అండతో పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఏడో వార్డులో నాయకుడు కొప్పునూరి ప్రవీణ్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి జరిగిన దుర్గామాత నిమజ్జనోత్సవానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. అన్ని కాలనీల్లో పర్యటించి సమస్యలను తెలుసుకున్నానని చెప్పారు. సీసీ రోడ్లను, డ్రైనేజీ కాలువలను నిర్మిస్తున్నానని, విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో పోటీచేసే ప్రవీణ్‌ను గెలిపిస్తే శరవేగంగా సమస్యలను తీర్చి, అభివృద్ధి పనులు చేస్తామని శంకర్ హామీ ఇచ్చారు.

లక్ష్మీవేంకటేశ్వరుడి తెప్పోత్సవం

చేవెళ్ల, అక్టోబర్ 3(ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాల్లో భాగంగా చేవెళ్లలోని శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి వారికి చక్రస్నానం, తెప్పోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. గురువారం పుష్కరిణిలో తెప్పోత్సవం అనంతరం రాత్రి ఆలయ ప్రాంగణంలో జమ్మిచెట్టుకు పూజలు చేశారు. అనంతరం చేవెళ్ల వీధుల్లో స్వామివారికి అశ్వ వాహన సేవ నిర్వహించారు. వేలాది మంది ప్రజలు తరలివచ్చారు. కార్యక్రమంలో ఈవో నరేందర్, ఆలయ ధర్మకర్త వామనాచార్యులు, అర్చకులు అనంతం, వాసుదేవచార్యులు, శ్రీపాద్, కన్నా, వైభవ్, ఆలయ సిబ్బంది సుఖేందర్, దయాకర్, ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.



స్వామివారికి చక్రస్నానం

ఉత్సవాన్ని తిలకించేందుకు వచ్చిన భక్తులు


పరిగి: శమీపూజలో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి


ఘట్‌కేసర్ రూరల్: మర్రిపల్లిగూడలో దుర్గామాత ఊరేగింపులో భక్తులు


మోమిన్‌పేట్: టేకుపల్లిలో దుర్గమాత శోభయాత్ర

ఆనందోత్సాహాలతో దసరా పండుగ


కొడంగల్‌లో షమి పూజలో పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి


పరిగి: నజీరాబాద్‌లో దుర్గామాత ఊరేగింపులో జనం

వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో గురువారం దసరా పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శమీ పూజలు నిర్వహించారు. జమ్మి ఆకు ఇచ్చిపుచ్చుకొని అలయ్ బలాయ్ తీసుకొని దసరా పండుగ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. సాయంత్రం రావణ దహనం కార్యక్రమాల్లో ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

\- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్


అనంతపద్మనాభ స్వామికి పట్టు వస్త్రాలు తీసుకొస్తున్న స్పీకర్


ధారూరులో రావణ దహనం


దోమ: మండల కేంద్రంలో దుర్గామాత నిమజ్జనంలో భక్తులు


కొడంగల్ రూరల్: టేకుల్‌కోడ్‌లో శమీ పూజలు చేస్తున్న పురోహితుడు


పెద్దేముల్: మంబాపూర్‌లో శమీ పూజలో గ్రామస్తులు


కులకచర్ల: ముజాహిద్‌పూర్‌లో శమీ పూజలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు


తాండూరు రూరల్: శమీపూజలో అంతారం గ్రామస్తులు


దోమ: శివారెడ్డిపల్లిలో శమీ పూజలో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి


శామీర్‌పేట్: టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్‌కు దసరా శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు మహిపాల్‌రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి


యాలాల: రాస్నంలో జమ్మి చెట్టుకు పూజలు చేస్తున్న పూజారి


ఘట్‌కేసర్ రూరల్: ఎదులాబాద్‌లో నృత్యాలు చేస్తున్న మహిళలు


శామీర్‌పేట: వేలంలో అమ్మవారి లడ్డును రూ.1.50లక్షలకు దక్కించుకున్న భక్తుడు డీబీ వెంకటేష్


కీసర రూరల్: ఎంపీ ఈటల రాజేందర్‌తో నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ చంద్రారెడ్డి

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన నేతలు


సీఎం రేవంత్‌రెడ్డికి దసరా శుభాకాంక్షలు తెలుపుతున్న డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణప్రసాద్, తదితరులు

పరిగి/దోమ/చౌడాపూర్/బషీరాబాద్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి గురువారం సొంత గ్రామం కొండారెడ్డిపల్లిలో దసరా ఉత్సవాల్లో పాల్గొన్నారు. అనంతరం శుక్రవారం కొడంగల్‌లో తన నివాసం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలను కలిశారు. పట్టణానికి చెందిన డీసీసీ ఉపాధ్యక్షుడు ఎం.లాల్‌కృష్ణప్రసాద్ సీఎంకు దసరా శుభాకాంక్షలు తెలిపారు. సీఎం కొడంగల్‌లోని తన నివాసంలో ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డితో కలిసి విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా దోమ మండలంలోని ఖమ్మం నాచారం గ్రామానికి చెందిన పరిగి మార్కెట్ కమిటీ డైరెక్టర్ శాంతకుమార్ సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిగి, తాండూరు ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు. అదేవిధంగా చౌడాపూర్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎల్పాటి అశోక్‌కుమార్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా సీఎంను బషీరాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మణ్‌రావు, జిల్లా కో-ఆప్షన్ సంఘం మాజీ అధ్యక్షుడు అక్బర్‌బాబా కలిసి దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

దేవేందర్ గౌడ్‌ను కలిసిన నాయకులు


దేవేందర్‌గౌడ్‌తో బీఆర్ఎస్, టీడీపీ నాయకులు

ఘట్‌కేసర్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మాజీమంత్రి తూళ్ల దేవేందర్‌గౌడ్‌ను శుక్రవారం ఘట్‌కేసర్ మున్సిపాలిటీకి చెందిన బీఆర్ఎస్, టీడీపీ నాయకులు కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపారు. దేవేందర్ గౌడ్ నివాసానికి వెళ్లిన బీఆర్ఎస్ నాయకులు బండారి శ్రీనివాస్‌గౌడ్, బిక్షపతిగౌడ్, టీడీపీ మండల అధ్యక్షుడు వేముల సంజీవ గౌడ్, మహేష్, రాములు తదితరులు కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

సబితారెడ్డిని కలిసిన మాజీ ఎమ్మెల్యే


సబితా ఇంద్రారెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఆనంద్, నాయకులు

వికారాబాద్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): దసరా పురస్కరించుకుని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని వికారాబాద్ బీఆర్ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్ నివాసంలో శుక్రవారం మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ పువ్వుల మొక్కల అందించి విజయదశమి శుభాకాక్షలు తెలిపారు. ఆయన వెంట బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గోపాల్, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, మల్లేశం, మహిపాల్‌రెడ్డి ఉన్నారు.

బాపూజీ చూపిన మార్గంలో నడుద్దాం


వికారాబాద్: గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

వికారాబాద్/ధారూరు/నవాబుపేట/చౌడాపూర్/కులకచర్ల/పరిగి/పెద్దేముల్/కీసర/శామీర్‌పేట్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): బాపూజీ మార్గంలో నడుస్తూ సత్యం, న్యాయం, సమానత్వం విలువలను కాపాడుదామని మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా గురువారం గాంధీ పార్కులోని గాంధీ విగ్రహానికి నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పట్టణ అధ్యక్షుడు గోపాల్, మాజీ కౌన్సిలర్ అనంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ధారూరు గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో కాంగ్రెస్ నాయకులు మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నవాబుపేట మండల కేంద్రంలో గురువారం గాంధీ జయంతిని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మేడిపల్లి వెంకటయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. గాంధీ చిత్రపటానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు సామా వెంకట్‌రెడ్డి, తలారి శేఖర్, మల్లేశ్ యాదవ్, ఏజాజ్, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు. చౌడాపూర్ మండల కేంద్రంలో గురువారం జాతిపతి గాంధీ, లాల్‌బహదూర్ జయంతి వేడుకలను నిర్వహించారు. పార్టీలకతీతంగా నాయకులు వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కులకచర్ల మండలంలోని ముజాహిద్‌పూర్‌లో గురువారంగాంధీ జయంతిని నిర్వహించారు. గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు పాల్గొన్నారు. పరిగిలో గాంధీచౌక్‌లోని గాంధీజీ విగ్రహానికి ఆయా పార్టీలు కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, ఇతర సంఘాలు వేర్వేరుగా పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ ఎం.అశోక్, తహసీల్దార్ ఆనంద్‌రావు, డీసీసీ ఉపాధ్యక్షుడు ఎం.లాల్‌కృష్ణ, కార్యదర్శి కె.హన్మంత్, పార్టీ మండల అధ్యక్షుడు బి.పరశురాంరెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఇ.కృష్ణ, సురేందర్, బి.ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. పెద్దేముల్ మండల కేంద్రంలోని గాంధీ విగ్రహం శిథిలావస్థకు చేరుకోవడంతో పెద్దేముల్‌కు చెందిన జితేందర్‌రెడ్డి ఆయన సొంత నిధులతో గాంధీ జయంతిరోజున కొత్తగా విగ్రహాన్ని ఏర్పాటు చేయించారు. నూతన విగ్రహానికి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పూలమాలలు వేసి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో విగ్రహదాత జితేందర్‌రెడ్డి, టీపీసీసీ ప్రధానకార్యదర్శి ధారాసింగ్, ఏఎంసీ చైర్మన్ అంజయ్య, వైస్‌చైర్మన్ సాయిని నారాయణరెడ్డి, యువనాయకులు పి.మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు. కీసరలో గురువారం మహాత్మాగాంధీ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు బెలిదె రమేష్‌గుప్త, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, నగేశ్, శ్రీధర్, శ్రీధర్ పాల్గొన్నారు. అదేవిధంగా శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలాల్లో గురువారం వివిధ పార్టీల నాయకులు, ప్రజలు, అధికారులు గాంధీ జయంతి వేడుకలను ఉత్సాహంగా, ఘనంగా జరుపుకున్నారు. గాంధీ విగ్రహాలకు వారు పూలమాలలను వేసి ఘనంగా నివాళులర్పించారు. దేవరయాంజాల్‌లో మేడ్చల్ జిల్లా ఆర్టీఏ సభ్యుడు జైపాల్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ నర్సింగ్‌రావుగౌడ్, వివిధ పార్టీల నాయకులు గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అలాగే తూంకుంట మున్సిపల్ కార్యాలయంలో మేనేజర్ శ్రావణ్‌కుమార్, వార్డు ఆఫీసర్లు, సిబ్బంది గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.


కీసర ప్రధాన చౌరస్తాలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

మాంసం దుకాణాల కిటకిట



కొడంగల్ రూరల్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): గాంధీ జయంతి సందర్భంగా గురువారం మాంసం, మద్యం విక్రయాలు జరపలేదు. దసరా పండుగలు అదేరోజు రావడంతో గురువారం ప్రజలకు చుక్క, ముక్క కరువైంది. శుక్రవారం మటన్, చికెన్, వైన్స్‌షాపులు కిటకిటలాడాయి.

జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలి

కొడంగల్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ఉన్న జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని కొడంగల్ ప్రెస్ క్లబ్ సభ్యులు కోరారు. దసరా వేడుకల్లో భాగంగా శుక్రవారం కొడంగల్‌లో తన నివాసంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను కలిశారు. ఈ సందర్భంగా కొడంగల్ ప్రెస్‌క్లబ్, టీయూడబ్ల్యూజే యూనియన్ నాయకులు జర్నలిస్టుల సమస్యలపై వినతి పత్రాన్ని సీఎం రేవంత్‌రెడ్డికి అందించారు. అర్హులైన జర్నలిస్టులకు ఇంటి స్థలాలు, హెల్త్‌కార్డులు తదితర సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. పలు సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర నాయకులు శ్రీకిషన్‌రావు, పకీరప్ప, జర్నలిస్టులు పృథ్వీరాజ్, రమేశ్, అనంతప్రసాద్, రాకేశ్, నరేందర్, గోపాల్, శ్రీకాంత్, నరేశ్, ఎండీ.ఆబీద్, అంజిలయ్య, శ్రీనివాస్‌గౌడ్, నర్సిములు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తుల అందజేత


కార్మికులకు వస్త్రాలు అందజేస్తున్న వెంకటేష్‌మహారాజ్

బషీరాబాద్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): దసరా పండుగను పురస్కరించుకొని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎస్.వెంకటేష్ మహరాజ్ బషీరాబాద్ పంచాయతీ పారిశుధ్య కార్మికులకు గురువారం దుస్తులను స్వయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ సభ్యుడు మునీర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సాయిల్‌గౌడ్, పవాన్‌ఠాగూర్, మాజీ ఎంపీటీసీ నరేష్‌చౌహాన్, ఖాలీద్, సాబణ్ణ పాల్గొన్నా

వజ్రేష్ యాదవ్‌ను కలిసిన కాంగ్రెస్ శ్రేణులు


తోటకూర వజ్రేష్ యాదవ్‌తో కాంగ్రెస్ శ్రేణులు

ఘట్‌కేసర్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి):కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్‌ను కాంగ్రెస్ శ్రేణులు శుక్రవారం ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీలకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపారు. బోడుప్పల్‌లోని వజ్రేష్ యాదవ్ నివాసంలో కలిశారు. ఆయనను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కొంతం అంజిరెడ్డి, ఎం వెంకటేష్, అంజనేయులు, ఖయ్యూం, జంగయ్య, బొక్క ప్రభాకర్‌రెడ్డి, నర్సింగ్‌రావు, దాసు, మల్లేష్, చిత్తారి, పారుక్, శ్రీనివాస్, మితేష్ తదితరులు పాల్గొన్నారు.

పూజారికి స్కూటీ బహూకరణ


ఎక్మాయిలో పూజారికి స్కూటీని బహూకరిస్తున్న ముదిరాజ్ కులస్తులు

బషీరాబాద్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎక్మాయి గ్రామ హనుమాన్ దేవాలయంలో నిత్య పూజారిగా సేవలందిస్తున్న ఉల్లాస్‌రావు జోషికి మున్నూరు కాపు పెద్దలు, కులస్తులు స్కూటీని బహూకరించారు. మైల్వార్ గ్రామానికి చెందిన ఉల్లాస్‌రావుజోషి గత 20ఏళ్లుగా ఎలాంటి జీతభత్యాలు లేకుండా ఆలయ పూజారిగా కొనసాగుతున్నారు. ప్రతీరోజు 5కిలోమీటర్ల దూరంలోని మైల్వార్ నుంచి ఆర్టీసీ బస్సులో రాకపోకలు సాగిస్తూ గ్రామ పూజారిగా సేవాలందిస్తున్నారు. ఈక్రమంలో మున్నూరు కాపు కులస్తులు స్కూటీని కొనుగోలు చేసి పూజారికి దసరా సందర్భంగా గురువారం స్వయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు కులస్తులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మేడ్చల్ టౌన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా మనోహరబాద్ మండలం పోతారం గ్రామానికి చెందిన అజై(23) గురువారతం రాత్రి తన బైక్‌పై వెళ్తుండగా ఎల్లంపేట వద్ద బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. దీంతో అతడి తలకు బలమైన గాయం కావటంతో అక్కడికక్కడే మృతిచెందాడు. బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సంపులో పడి వ్యక్తి..


సంపు గుంతలో పడి మృతిచెందిన వ్యక్తి

తాండూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): పాతతాండూరుకు చెందిన మంగళి మానయ్య(50) శుక్రవారం ప్రమాదవశాత్తు వాటర్ ఆపరేటింగ్ మ్యాన్‌హోల్‌లో పడి మృతిచెందినట్లు స్థానికులు తెలిపారు. మ్యాన్‌హోల్ తెరచిఉండడంతో ఈ ఘటన చోటు చేసుకుంది. మద్యం సేవించి ఉండడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు.

అనారోగ్యంతో యువకుడి ఆత్మహత్య


మణికంఠ మృతదేహం

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ రాజువర్మ తెలిపిన వివరాల ప్రకారం.. అన్నోజిగూడ, రాజీవ్‌గృహకల్పకు చెందిన పిప్పల మణికంఠ(25) కొద్ది సంవత్సరాలుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. శుక్రవారం సాయంత్రం కుటుంబసభ్యులు ఇంటిబయట మాట్లాడుతుండగా పడకగదిలోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన తల్లిదండ్రులు హుటాహుటిన చికిత్సనిమిత్తం ఓప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

విరిగిన అంబులెన్స్ టైర్‌రాడ్

● తప్పిన ప్రమాదం ● గర్భిణిని ఆస్పత్రికి తరలిస్తుండగా ఘటన


టైర్‌రాడ్ విరిగి రోడ్డుమధ్యలో నిలిచిపోయిన అంబులెన్స్

పెద్దేముల్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ధారూర్‌కు చెందిన 108 వాహనం శుక్రవారం ఉదయం పెద్దేముల్ మండలం నుండి ఓ గర్భిణిని మాతాశిశు ఆస్పత్రిలో తీసుకెళ్తుండగా ఖానాపూర్ గేటు సమీపంలోని ముందు భాగంలోని టైర్‌రాడ్డు విరిగింది. దీంతో అంబులెన్స్ అక్కడి నుంచి కదలలేని పరిస్థితి ఏర్పడడంతో మరో వాహనాన్ని పిలిపించి అందులో మహిళను ఆస్పత్రికి తరలించారు.

గుంతలరోడ్లే కారణం

మండలంలో రోడ్లన్నీ గుంతలుపడి ప్రమాదకరంగా మారాయి. తాండూరు-హైదరాబాద్ రోడ్డుకు నిధులు మంజూరైనా పనులు ముందుకు సాగడం లేదు. కాంట్రాక్టర్ అక్కడక్కడ రోడ్డును తవ్వేసి తిరిగి కంకరవేసి పూడ్చివేశాడు. తిరిగి అవి పెద్దగోతులు ఏర్పడ్డాయి. గోతులు పడ్డరోడ్డుపై వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గురువారం అత్యవసర వాహనానికి కూడా ఇబ్బందులు తప్పలేదు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి తక్షణమే గుంతలు పూడ్చివేసేందుకు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

జాతీయ స్థాయిలో సీసీఆర్టీకి ఎంపిక

షాపూర్‌నగర్, అక్టోబర్ 3(ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం మెట్‌కానీగూడ ప్రాథమిక ప్రైమరీ పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేస్తున్న నేలపూడి తబితకు అరుదైన అవకాశం వరించింది. ఢిల్లీలో జరిగిన సెంటర్ ఫర్ కల్చరల్ రిసోర్స్ అండ్ ట్రైనింగ్‌కు మేడ్చల్ జిల్లా నుంచి పబిత హాజరయ్యారు. తెలంగాణ నుంచి 9మంది ఉపాధ్యాయులు సీసీఆర్టీకి ఎంపిక కాగా సెప్టంబరు 10 నుంచి 24 వరకు 15రోజులపాటు శిక్షణ పొందారు. శిక్షణ అనంతరం సీసీఆర్టీ డైరెక్టర్ రాజీవ్ కుమార్ చేతుల మీదుగా సర్టిఫికెట్‌ను అందజేశారు.

ఆలయ అభివృద్ధికి నిధులివ్వండి


సీఎంతో మఠాధిపతి డాక్టర్ సిద్ధలింగమహాస్వామి, గురునాథ్‌రెడ్డి

కొడంగల్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నిరంజన మఠం ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని మఠాధిపతి డాక్టర్ సిద్ధలింగమహాస్వామి కోరారు. దసరా వేడుకల్లో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డిని పోలీసు హౌసింగ్ కార్పోరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ముద్దప్పదేశ్‌ముఖ్, మున్సిపల్ మాజీ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి తదితరులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పరిగి, తాండూర్ ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన ప్రీమియర్ క్రికెట్ మ్యాచ్

పూడూరు, అక్టోబర్ 3, (ఆంధ్రజ్యోతి): తిర్మలాపూర్‌లో విజయదశమిని పురస్కరించుకుని తిర్మలాపూర్ ప్రీమియర్ క్రికెట్ మ్యాచ్ నిర్వహించారు. గ్రామానికి చెందిన మేనెజ్‌మెంట్ కన్నయ్య ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా జరిగిన ఈ మ్యాచ్ శుక్రవారం ముగిసింది. విజేత జట్టుకు కన్నయ్య రూ.10వేలను అందజేశారు. రన్నర్‌గా నిలిచిన తెలంగాణ బాయ్స్ జట్టుకు రూ.5వేలు అందజేశారు.

చంద్రవంచ మైబుసుబాని దర్గా జాతర షురూ

తాండూరు రూరల్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): చంద్రవంచ మైబుసుబాని జాతర ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు గంధం, రాత్రి నదీ జలాలు తేవడం కార్యక్రమాలు నిర్వహించారు. నేడు(శనివారం) జాతర ప్రారంభమవుతుందని నిర్వాహకులు పటేల్ సుదర్శన్‌రెడ్డి, పటేల్ రవిశంకర్, హరి సర్వోతంరావ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతరలో ప్రజలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

ఘనంగా ఆత్మీయ సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

నవాబుపేట, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అక్నాపూర్‌లో శుక్రవారం పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకున్నారు.విద్యాబుద్దులు నేర్పించిన గురువులను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.